# లిక్విడ్ లక్నో పాక్

**వీధి** గుమ్మం దాకా వెళ్లి వేణుని ఆఫీసుకి సాగనంపి, ఇంట్లోకి వచ్చింది వసుంధర. వేణుకి పెళ్లై ఏడాది అవుతోంది. నాలుగు కేజీలు బరువు తగ్గాడు. ఆఫీసులో వాళ్లు, ఏ డాక్టరుకైనా చూపించుకోమన్నారు.

"ఏం ఫర్వాలేదు. అన్నీ అవే సర్దుకుంటాయి" అన్నాడు.

ఆఫీసు మూసే వేళ అవుతోంది. ఇంటికి వెళ్లాలంటే భయంగా ఉంది వేణుకి. పొద్దున్న వసుంధర చెప్పింది. "ఆఫీసవ్వగానే ఇంటికి వచ్చేయండి. ఈ రోజు ఒక మంచి స్వీట్ తిందురుగాని!"

విధి లేక విభుడు, సాయంకాలం ఇల్లు చేరాడు.

ఒక కప్పు చెంచాతో సహా, చేతికి అందించింది వసుంధర. కప్పులోని పదార్థం చూసాడు! రంగైతే మైసూర్‌పాక్‌లా ఉంది. మైసూర్‌పాక్ కాదనుకున్నాడు మైసూర్‌పాక్ చెంచాతో తినరని తెలుసు. వేణుకి. చెంచాతో కప్పులోని పదార్థం కొంచెం తీశాడు తిని చూశాడు. రుచి కూడా మైసైర్‌పాక్‌లానే వుంది. తను తినే పదార్థాలు ఏమిటనే నిశ్చయానికి వేణు తనంతట తను రాడు. అంతకు ముందు తను చెప్పిన పేర్లు తప్పని తేలింది. ఈసారి కూడా వసుంధర్నే అడిగాడు. "తను తింటూన్న పదార్థమేమిటని"

"ఎల్.ఎల్.పి." అని చెప్పింది.

"ఏద్దైనా ఇంగ్లీష్ డిష్షా?"

"కాదండీ! మన ఇండియాదే! లిక్విడ్ లక్నో పాక్!" అంది.

"మైసూర్ పాక్‌లా వుందే!"

"మీకేం తెలీదు! ఈ లిక్విడ్ లక్నోపాక్, మైసూర్‌పాక్ రెండూ కజిన్ సిస్టర్స్ లాంటివి! వంటలో వాడే పదార్థాలు ఒకటే అయినా, వేరు, వేరు స్వరూపాలలో ఆవిర్భవిస్తాయి!"

పాపం వేణు వెర్రిమొహం వేశాడు. మామూలు విషయాలే అర్థం కావు అతనికి. ఈ వేదాంత ధోరణిలో చెప్పే విషయాలేమర్థమవుతాయి పాపం!

"ఏమిటి మొహం అలా పెట్టారు. ఎల్. ఎ.పి. బాగా లేదా" అంది.

"బాగుంది. దీంట్లో మైసూర్‌పాక్‌ని చూసుకొని తింటున్నాను" అన్నాడు.

ఈలోపు వేణు ఫ్రెండ్ వాసు వచ్చాడు. ఎల్.ఎల్.పి. బాధ భరించలేక "ఎంగిలి చెయ్యలేదు! ఈ కొత్త స్వీట్ తినరా!" అని తన కప్పు వాసుకి ఇవ్వబోయాడు, వేణు.

"అయ్యో! అదెందుకు ఇవ్వడం, అన్నయ్యగారికి ఇంకో కప్పు తెస్తాను" అంది వసుంధర.

"ఈ రోజు కొత్త ఐటమ్ చేస్తున్నట్లు ఆఫీసులో ఎందుకు చెప్పలేదురా? ఇంతకీ దాని నామధేయం ఏమిటి?" అడిగాడు వాసు.

పాపం వాసు కూడా ఇంతకు ముందు వసుంధర చేసిన బ్రహ్మపదార్ధాలు తిని రాత్రి నిద్రపట్టక, తన శ్రీమతి చేత చీవాట్లు తిన్నాడు. వసుంధర చేసినవి తిని. మళ్లీ ఇంట్లో చీవాట్లు కూడా తినలేక, ఈ మధ్యన వేణూ ఇంటికి రావడం మానేశాడు.

కర్మ తప్పించే వాడెవడు! ఈరోజు వీధితలుపులు తీసివున్నాయి కదాని లోపలికి వచ్చాడు.

"తీసుకోండి అన్నయ్యగారు! ఇంతకు ముందెప్పుడూ తినుండరు!" అంటూ వసుంధర ఇస్తున్న కప్పు చూసి ఉలిక్కి పడ్డాడు వాసు.

తప్పేదేముంది! తినడం మొదలు పెట్టాడు!

"ఎలా ఉంది?" అంది వసుంధర.

"నిన్నే అడుగుతున్నార్రా!" అన్నాడు వాసూ, వేణుకేసి తిరిగి.

"ఏలా ఉందో చెప్పడానికి ఇంకా టైమ్ పడుతుంది. నీకెలావుందో చెప్పు!" అన్నాడు వేణు.

"అవును అన్నయ్యగారూ, ఎలా వుంది! అన్నయ్యగారు మీరు లక్నోలో కొన్నాళ్లు ఉద్యోగం చేశారట కదా! అక్కడెప్పుడైనా ఈ లిక్విడ్ లక్నోపాక్ తిన్నారా?"

"అయ్యో తినకేం తిన్నాను! ఒకసారి కడుపునొప్పి వచ్చింది. అప్పుడు డాక్టర్ చెప్పారు నీకు ఎల్.ఎల్.పి. అంటే ఎలర్జీలా ఉంది, ఇంకెప్పుడూ తినొద్దు అన్నారు.

అప్పట్నుంచీ తినడం మానేశాను! ఇది అదేనని తెలియక మొదలు పెట్టాను. సారీ చెల్లాయి!" అంటూ, కప్పు పక్కన పెట్టేశాడు.

"చాలా మంచి స్వీట్ నువ్వు తినరా వేణూ!"

"దొంగ వెధవ! చాలా తెలివైన వాడు! తను తప్పించుకుని నన్నిరికిస్తున్నాడు" అనుకున్నాడు, వేణు.

"కొంచెం ఫ్లాస్క్‌లో పోసిస్తాను, మా వదినకి తీసుకెళ్లండి"

"సారీ అమ్మా! మీ వదిన ఊళ్లో లేదు" అంటూ మళ్లీ కొంచెమైనా తినమని వసుంధర మొహమాట పెడుతుందేమోనన్న భయంతో, "వస్తా(నా వేణూ! రేపు ఆఫీసులో కలుద్దాం!'. అని తు(ర్రుమన్నాడు.

"ఉండండీ! కాఫీ తెస్తాను" అని వంటింట్లోకి వెళ్లింది.

'ఇదే మంచి సమయం' అనుకుంటూ, మిగిలిన లిక్విడ్ పూలకుండీలో పోసేశాడు వేణు.

కాఫీ కప్పు చేతికిస్తూ "ఏమిటో ఏ కొత్త ఐటమ్ చేసినా మిగిలిపోతోంది! ఇదే కొంత మందైతే, వాళ్ళయిళ్ళల్లో ఆ స్వీట్ తయారు చేసిన గిన్నెలు కూడా నాకుతారు, విశ్వాసంగా!"

కొంచెం ధైర్యంతెచ్చుకున్న వేణు "వసుంధరా! నువ్వు అంతకు ముందు చేసిన ఐటమ్స్ మళ్లీ చేస్తే, నాక్కూడా, తినడానికి ధైర్యంగా ఉంటుంది! ఎంతైనా నోన్ డెవిల్స్‌ఆర్ బెటర్ కదా!"

"జోక్స్ వెయ్యకండి. ఆ ఎల్.ఎల్.పి. ఎలా ఖర్చవుతుందా అని నేను బెంగపెట్టుకున్నాను"

"ఏం ఫర్వాలేదు పోతే పోయింది! ఏ కుక్కకైనా కొంత పెట్టు"

"ఆ మాత్రం తెలివి నాకు లేదనుకోకండి! తయారవ్వగానే, ఈ లిక్విడ్ ఖర్చవ్వడం కష్టమని తెలుసుకున్నాను. వెంటనే పక్కింటి వాళ్ల కుక్కకి కొంత పెట్టాను! అది తిని ఛస్తేకదా"

"తింటే ఛస్తామని దానికి తెలుసే! అయినా కుక్కలు కూడా తిననివి మా చేత ఎందుకు తినిపిస్తున్నావ్?"

"ఏం చేస్తాను చెప్పండి! అసలు మైసూర్‌పాక్ చేద్దామనే మొదలు పెట్టాను. అన్ని సరుకులు కొలతల ప్రకారం తీశాను. శనగపిండి కొంచెం తక్కువగా ఉంది. "ఆగే బడేతో పీచే హట్నానహీ" అని, ఏదో అజ్ఞాత వాణి వినిపించింది. ధైర్యం తెచ్చుకున్నాను. అంతే! కొంచెం సున్నిపిండి పోసేశాను. స్వీట్ గట్టిపడుతోంది. ఎందుకైనా మంచిదని ఒక అరకిలో నెయ్యి ఎక్కువేసేశా! అంతే! ఈ బ్రహ్మపదార్థం తయారైంది. స్వరూపం ద్రవంగా మారింది. జాలేసింది. నేను కన్న బిడ్డకి బారసాల చెయ్యలేనా అని జిజ్ఞాస కల్గింది! వెంటనే 'లిక్విడ్ లక్నో పాక్' అని పేరు పెట్టేశా! మైసూర్‌పాక్ బదులు లక్నో అనీ, జారుడుగా తయారై ద్రవగుణాన్ని సంతరించుకోవడం వల్ల, పేరుకు ముందు లిక్విడ్ చేర్చాను. తర్వాత కథ మీరు వెండి తెరపై చూస్తున్నారు"

"నీకసలు తెలివి లేదే! ఆ లక్నో అని కాకుండా ఇంకో ఏ ఊరు పేరైనా కలిపితే, ఆ వాసుగాడు కొంతైనా తినేవాడు! లక్నో అనగానే లక్నోలో డాక్టర్ తినొద్దన్నాడని తప్పించుకున్నాడు".

"లక్నో మన ఆంధ్రప్రదేశ్‌కి దూరం కదా అని, అందరూ "లక్నో స్వీట్"గా నమ్ముతారని, పేరులో ఆ లక్నోచేర్చాను. అసలాయన వస్తాడని, నాకెలా తెలుస్తుంది చెప్పండి!"

"ఏది ఏమైనా ఇంక కొత్త ఐటమ్స్ చేయడం, బారసాల చేయడం, శునకాల సహనం పరీక్షించడం చెయ్యకే! వసుంధర అంటే భూమి అని కూడా అర్థం. ఈ భూమ్మీదున్న ప్రాణికోటిని రక్షించు"

"సర్లెండి స్వామీ! మీరలా వాకింగ్‌కి వెళ్లిరండి"

తర్వాత పనిమనిషి వచ్చింది. "అప్పలమ్మా! ఆ గిన్నెలో ఉన్న స్వీట్, ఈ కేరియర్లో పోసుకుని ఇంటికి తీసుకెళ్ళు, అందరూ తినండి!" అంది వసుంధర, అదేదో ప్రసాదంలాగా.

"వద్దమ్మా!" అంది అప్పలమ్మ.

"ప్రతీదానికీ అలా భయపడిఛస్తావేమిటే! ఎప్పుడో అప్పుడు, అందరూ చచ్చేవాళ్లమే! ఈ వసుంధరపై ఎవ్వరూ శాశ్వతం కాదు!"

'ఏమోనమ్మా! ఇంతకుముందు మీరిచ్చింది తిని, నా పెనిమిటి అప్పలకొండ మూడు రోజులు లేవ లేదు! మూడొందలు కూలి నష్టమైంది!"

"ఈసారి ఏం ఫర్వాలేదు! వెన్న కాచిన స్వచ్ఛమైన నెయ్యి బోల్డు పోశాను. ఇది తింటే బోల్డు బలం వస్తుంది"

మొత్తం మీద అప్పలమ్మ ఆ ఎల్.ఎల్.పి. ఇంటికి తీసుకెళ్లడం, ఇంటిల్లిపాదీ అది తినడం, గున్యాజ్వరం వచ్చినంత బాధపడడం జరిగిపోయాయి.

గొడవలు జరిగాయి! వసుంధర ఇంట్లో పని మానేసింది అప్పలమ్మ! కొత్త పనిమనిషి రెండు నెలల దాకా కుదరలేదు! ఈ రెండు నెలలూ 'ఎల్.ఎల్.పి. ముర్దాబాద్' అనుకుంటూ, వేణూయే ఇంట్లో అంట్లు తోమాడు.

ఈ అంట్ల విషయం తెలుసుకున్న వాసూ, ముదితల్ ముద్దారగ చేయించలేని పన్లు గలవే వసుంధరలో అన్నాడు. "వసుంధర" అనగానే ఉలిక్కిపడ్డాడు. వేణు.

(ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 4-1-2007)